

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

బుధవారం 28 మే 2025 పేజీలు 8


# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం





### యోగాసనాలు మనిషి ఆరోగ్యానికి దారిదీపాలు

### విజయవంతంగా యోగాంధ్ర మాసోత్సవాల ఏడో రోజు కార్యక్రమాలు

### వీఎంసీ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మే 27, మేజర్ న్యూస్ :** మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి మార్గం వేసే యోగా విశిష్టతపై ప్రజలకు అవగాహన కల్పించి, జీవితంలో యోగాసనాల అభ్యసనను భాగం చేసుకునేలా ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర మాసోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా, విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డులో ప్రతిరోజూ యోగా కార్యక్రమాలు జరుగుతున్నాయని విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం బీఆర్టీఎస్ రోడ్డు శారదా కళాశాల వద్ద జరిగిన ఏడో రోజు యోగాసనాల కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ వివిధ శాఖల అధికారులతో కలిసి యోగాసనాలను ప్రాక్టీస్ చేశారు.

2



### యోగ కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలి

### కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ప్రజలందరూ ఆ దిశగా దృష్టి సారించి యోగ కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. మచిలీపట్నం నగరంలోని గాంధీనగర్ లో గల ఏపీ యోగా సభ వారి ఉదయపు నడక మిత్రమండలి భవనంలో మంగళవారం తెల్లవారుజాముననే జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ యోగా శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. అనంతరం అక్కడి నుండి యోగా ర్యాలీ ప్రారంభించి సుమారు 70 మంది యోగా సభ్యులతో కలిసి యోగా చేయండి ఆరోగ్యం పొందండి. అని నినాదాలు

మిగతా 2లో...

## మనమిత్ర సేవలపై అవగాహన కల్పించండి

### సేవలను సద్వినియోగం చేసుకునేలా పారిశ్రామిక వర్గాలను ప్రోత్సహించండి

### గడువుకు ముందే పారిశ్రామిక అనుమతుల జారీపై దృష్టిపెట్టండి

### పారిశ్రామిక యూనిట్లకు రూ. 4.13 కోట్లు మేర ప్రోత్సాహకాలకు ఆమోదం

### ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మే 27, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం యాప్ ఆధారిత డిజిటల్ వాట్సాప్ గవర్నెన్స్ (మనమిత్ర) ద్వారా ప్రజలకు 500కు పైగా సేవలు అందిస్తోందని, ఇందులో అందుబాటులో ని పారిశ్రామిక సేవలపై పారిశ్రామికవేత్తలు, పారిశ్రామిక సంఘాలకు అవగాహన కల్పించి, సద్వినియోగం చేసుకోవాలని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు.

మిగతా 2లో...

31న మంగినపూడి బీచ్‌లో జరిగే యోగాంధ్రకి

## కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయాలి

### కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈనెల 31వ తేదీన మంగినపూడి బీచ్ లో జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి పక్కా ప్రణాళికతో కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి మంగినపూడి బీచ్, మచిలీపట్నం నగరంలో యోగాంధ్ర కార్యక్రమాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉందన్నారు.

మిగతా 2లో



## అసలు ఉద్యోగులు ఎవరు...?

### కమిషనర్ ఆర్డర్ లేకుండా పనిచేస్తున్న కొంతమంది పెద్దలు...?

### శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో వీరు ఆడిందే ఆట పాడిందే పాట?

### వెంటనే ఆలయ ఈవో నిజమైన ఉద్యోగులను ప్రజలకు తెలపాలి?

వివరాలు 2లో...

(మొదటిపేజీ తరువాయి)



## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ ప్రతినిధి సత్యనారాయణ మార్గనిర్దేశనంలో యోగాసనాల అభ్యసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమం సందర్భంగా వీఎంసీ అదనపు కమిషనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ యోగాసనాలు మనిషి ఆరోగ్యానికి దారిదీపాలని, ప్రతిఒక్కరూ యోగా, ధ్యానాన్ని జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర మాసోత్సవాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని, యోగాను నేర్చుకొని జీవితాంతం ఆచరించాలని సూచించారు. మన భారతీయ సంస్కృతి ప్రపంచానికి ఇచ్చిన అమూల్య బహుమతి యోగా అని, ఇది కేవలం శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక ఆరోగ్యానికి దృఢత్వం చేకూర్చుతుందని పేర్కొన్నారు. యోగాచరణను ఏదో ఒక్కరోజుకే పరిమితం చేయకుండా తమ జీవనశైలిలో భాగం చేసుకోవడం ద్వారా రోజువారీ పనిలో మంచి ఫలితాలు సాధించేందుకు అవకాశముంటుందన్నారు. జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారి డా. వి.రాణి, ఆయుష్ అధికారి డా. రామతల్లేషి, మెడికల్ ఆఫీసర్ డా. వై.రత్న ప్రియదర్శిని, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. కొల్లేటి రమేష్, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, నగర ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అసలు ఉద్యోగులు ఎవరు...?



**పెనుగంచిప్రోలు, మే 27,మేజర్ న్యూస్ :** పెనుగంచిప్రోలు పట్టణములో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో రోజు రోజుకు గుర్తింపు లేని ఉద్యోగులు ఎక్కువవుతున్నారు. ఎవరు ఉద్యోగులు, ఎవరు ఉద్యోగులు కారో సందిగ్ధంలో భక్తులు. అమ్మవారి ఆలయంలో పర్మినెంట్ ఉద్యోగులకు డ్రెస్ కోడు, ఐడి కార్డు కంపల్సరీ.కానీ వారు ఏ డ్రెస్ ఎప్పుడు వేస్తారో తెలియదు ఐడి కార్డు ఉండదు. కానీ మేము అమ్మవారి ఆలయ ఉద్యోగులమని బెదిరిస్తూ ఉంటారు. కొంతమంది ఎస్సార్లు కూడా తప్పులుతడకగా ఉన్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. వారికి అంటే ఏంటి అని ఎలా ప్రమోషన్లు వస్తున్నాయి ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కుతూ, ప్రమోషన్లు తెచ్చుకుంటున్నారని విమర్శలు.అసలే ఉద్యోగాలు లేక నిరుద్యోగ జీవనం గడుపుతున్న కొంతమందికి వ్యతిరేకంగా రిటైర్మెంట్ అయి కూడా అక్కడ ఉద్యోగాలు కొనసాగుతున్నారు. వయసుతో నిమిత్తం లేకుండా కూడా కొంతమంది ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతి గానీ లేదా కమిషనర్ వారి ఉత్తర్వులు గాని ఉంటేనే దేవాలయంలో పనిచేయాలి. అలాకాకుండా ఎవరెవరో అనుమతుల ద్వారా దేవాలయంలో ఉద్యోగాలు చేయటం ఏమిటని ప్రశ్నిస్తున్న భక్తులు, గ్రామస్తులు. వెంటనే ఆలయ ఈవో ఎవరెవరు ఉద్యోగాలు ఎక్కడెక్కడ చేస్తున్నారో పరిశీలన చేసి నిబంధనల ప్రకారం ఉన్న ఉద్యోగులను ఉంచి మిగతా వారిని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వివరణ కొరకు ఈవోను ప్రయత్నించగా ఆయన చరవాణి అందుబాటులో లేదు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



(మొదటిపేజీ తరువాయి)

చేస్తూ మచిలీపట్నం పట్టణ పురవీధుల్లో యోగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఊరేగింపుగా జడ్పీ కూడలిలోని వినాయకుడి గుడి వద్దకు చేరుకున్నారు. అక్కడ అధికారిక యోగా ర్యాలీ ప్రారంభోత్సవ సమావేశం జరిగింది. అనంతరం అక్కడ నుంచి రెవెన్యూ, పోలీసు,రెడ్ క్రాస్, మునిసిపల్, ఆరోగ్య, ఆయుష్, సమాచార తదితర ప్రభుత్వ శాఖల అధికారులు సిబ్బంది,కృష్ణా విశ్వవిద్యాలయం,నోబుల్ కళాశాల ప్రొఫెసర్లు,సిబ్బంది, విద్యార్థులు, చేద్దాం చేద్దాం యోగా చేద్దాం, సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే, యోగా చేద్దాం అందరి చేత చేయిద్దాం, అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సాయిబాబా గుడి వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తన స్వానుభవం వివరిస్తూ నిత్యం యోగా వలన సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని, మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ప్రజలంతా నిత్యం యోగా చేయాలని, ఆరోగ్యకర సమాజాన్ని తయారు చేయాలన్నారు.తాను నిత్యం గాంధీనగర్ లోని వాకర్స్ అసోసియేషన్ హాలులో యోగా చేస్తునానన్నారు. యోగా వలన తన విధి నిర్వహణలో అద్భుత ఫలితాలు లభించాయన్నారు. ఆరోగ్య సమస్యలు తొలగిపోయాయని,ఉద్యోగ నిర్వహణలో ఒత్తిడి తగ్గిందన్నారు.నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఏవిధమైన టెన్షన్ లేదన్నారు. ఎపి యోగ సభ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో 5 కేంద్రాలలో ఉచితంగా యోగ శిక్షణ ఇస్తున్నందుకు యోగాసభ గురువులను అభినందించారు. నగరంలో చింతగుంట పాలెం, గాంధీనగర్, శంకర మఠం గొడుగు పేట, రెడ్ క్రాస్ భవనాలలో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యకర సమాజాన్ని తయారు చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా పోలీసు అధికారి ఆర్ గంగాధర్ రావుతో పాటు ఏపీ యోగాసభ గురువులు చింతయ్య, రమేషు, శ్రీనివాసు పలువురు యోగ సాధకులు పాల్గొన్నారు.



# మనమిత్ర సేవలపై అవగాహన కల్పించండి

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం వర్చువల్‌గా జరిగింది. ఈ సమావేశంలో పారిశ్రామిక విధానాల కింద పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, పారిశ్రామిక అనుమతులు తదితరాలపై చర్చించారు. ద

2025, ఏప్రిల్ 1 నుంచి మే 26 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పారిశ్రామిక అనుమతులకు సంబంధించి 824 దరఖాస్తులు స్వీకరించగా, ఇప్పటికే 762 దరఖాస్తులు ఆమోదం పొందాయని పరిశ్రమల శాఖ అధికారులు వివరించగా.. మిగిలిన దరఖాస్తులను కూడా నిర్దేశ గడువుకు ముందే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. పారిశ్రామిక అభివృద్ధి విధానం (2015-20), పారిశ్రామిక అభివృద్ధి విధానం (2020-23), పారిశ్రామిక అభివృద్ధి విధానం (2023-27) కింద ఎంఎస్ఎంఈ రంగానికి అందించే ప్రోత్సాహకాలపై స్క్రుటినీ కమిటీ సమావేశాలు నిర్వహించగా 90 క్లెయిమ్‌లకు రూ. 4.13 కోట్లు మేర ప్రతిపాదనలు పంపగా.. వీటిపై తాజాగా చర్చించి డీఐఈపీసీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేగవంతమైన పారిశ్రామిక వృద్ధి లక్ష్యంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కొత్త పారిశ్రామిక అభివృద్ధి విధానం 4.0.. పారిశ్రామిక రంగం అపార అభివృద్ధికి చోదక శక్తిగా ఉందని, పరిశ్రమల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న వనరులపై ఔత్సాహికులకు అవగాహన కల్పించాలన్నారు. పారిశ్రామిక అనుమతులకు సంబంధించిన దరఖాస్తులను నిర్దేశ గడువు (ఎస్ఎల్ఏ)కు ముందే పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. అదేవిధంగా ఏపీఐఐసీ నుంచి 13 రకాల సేవలను వాట్సాప్ గవర్నెన్స్‌తో అనుసంధానినంచడం జరిగిందని.. వీటిపై పారిశ్రామిక వర్గాలకు అవగాహన కల్పించాలన్నారు. పీఎంఈజీపీ ద్వారా ఎంఎస్ఎంఈ యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకుల నుంచి రుణ మంజూరు జరిగిన యూనిట్లు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చూడాలని, పీఎం విశ్వకర్మ దరఖాస్తులపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, ఇన్‌ఛార్జ్ జిల్లా పరిశ్రమల అధికారి ఆర్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## 31న మంగినపూడి బీచ్‌లో జరిగే యోగాంధ్రకి కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయాలి





(మొదటిపేజీ తరువాయి)

ఇందులో భాగంగా ఈనెల 31వ తేదీన ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు మంగినపూడి బీచ్ లో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు చాలా కట్టుదిట్టంగా చేయాల్సి ఉందన్నారు. ముఖ్యంగా 1000 మంది పాల్గొనుటకు వీలుగా పక్కా ప్రణాళికతో లేఅవుట్ సిద్ధం చేయాలన్నారు.వేదిక, పెద్ద ఆకుపచ్చ తివాచి, యోగా చాపలు, స్తంభాలు, జెండాలు, బ్యాక్ డ్రాప్ బ్యానర్లు, డ్రోన్లు, పి ఎస్ సిస్టం, మంచినీరు, స్నాక్స్, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. యోగ గురువులతో కూడా మాట్లాడి ఆ రోజున వారు వచ్చే విధంగా చూడాలన్నారు. ప్రజలు వచ్చేందుకు వీలుగా రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. డి ఆర్ డి ఏ, మెప్మా స్వయం సహాయక సంఘాల మహిళలు, ఉపాధి హామీ శ్రామికులు, ఆశ అంగన్వాడి కార్యకర్తలు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు వారి సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. బీచ్ లో ఎలాంటి చెత్తాచెదారం లేకుండా పారిశుధ్య ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. ఈ యోగాంధ్ర కార్యక్రమానికి విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు సంపూర్ణ పర్యవేక్షణ చేయాలన్నారు. అలాగే వచ్చే జూన్ నెల 2 వ తేదీన కూడా 5000 మంది వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు తో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాలు లక్ష్మీ టాకీస్ నుండి సాయిబాబా గుడి వరకు ఒకవైపు రహదారిపైనే నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా దారి మళ్లించాలన్నారు.ఈ సమావేశంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, యోగాంధ్ర సమన్వయ అధికారి పోతురాజు, డ్వామా డి ఆర్ డి ఏ ఐసిడిఎస్ పీడీలు శివప్రసాద్, హరిహర నాథ్, ఎం ఎన్ వాణి, డీఎస్ఓ పార్వతి, డిపిఓ అరుణ, ఆర్డీవో కే స్వాతి, ఆర్టీవో శ్రీనివాస రావు, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ జావేద్ ఖాన్, డి ఎస్ డి ఓ ఝాన్సీ లక్ష్మి పర్యాటక అధికారి రామ్ లక్ష్మణ్, తాసిల్దార్లు మధుసూదన్ రావు, నాగభూషణం తదితర అధికారులు పాల్గొన్నారు.

# భక్తులకు కరువైన అమ్మవారి తిరునామం



**పెనుగంచిప్రోలు, మే 27, మేజర్ న్యూస్ :** పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులు అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించేటప్పుడు ఆలయ పూజారులు అమ్మవారి యొక్క తిరునామము భక్తులకు ధరించేలా చేయడం ఆనవాయితీ. కానీ మంగళవారం నుండి ఆ విధానానికి స్వస్తి పలకాలని ఈవో, మరొక తాత్కాలిక ఉద్యోగి హు కుం జారి చేసారు అనేది సమాచారం. రోజురోజుకు అమ్మవారి ఆలయంలో ఆచార వ్యవహారాలకు తూట్లు పొడుస్తున్న ఈ అధికారులు అమ్మవారి ఆలయంలో అవసరమా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులు పున పరిశీలన చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏదైతే అమ్మవారి తిరునామం ఆపుదల చేశారో అది పునరావతం కావాలని భక్తులు ప్రజలు కోరుతున్నారు. తిరుమల గిరి, వేదాద్రి దేవాలయాల్లో మనం చూస్తున్నాము భక్తులకు తిరునామం పెట్టేవారు వారెవరో తెలియదు ఎలాంటి పూజాది కార్యక్రమాలు కానీ వారికి తెలియదు. కానీ తిరునామం పెట్టి ఒక్కొక్కరి దగ్గర 20 రూపాయలు పైబడి వసూలు చేస్తున్నారు. అది శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో అవసరమా అలాంటివారు కోకొల్లలుగా పుట్టుకొస్తారు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం వద్దని భక్తులు వాపోతున్నారు. వెంటనే తొలగించిన అమ్మవారి తిరుణామాన్ని ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.





## మహానాడులో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సౌమ్య

**నందిగామ, జనవరి 27, మేజర్ న్యూస్:** దేవుడి గడప కడపలో జరుగుతున్న మహానాడు సమావేశానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య హాజరయ్యారు. మంగళవారం హాజరై సౌమ్య సభ్యత్వ నమోదు పేరును నమోదు చేసుకున్నారు. అనంతరం వేదికపై హాజరైనప్పుడు లోకేష్ ఎమ్మెల్యేలందరినీ గౌరవంగా పలకరించారు. మహానాడు కి హాజరు కావడం ఆనందంగా ఉందని, పలు తీర్మానాలు మహానాడులో ప్రవేశపెడుతున్నట్లు సౌమ్య తెలిపారు.

## మహానాడులో బ్రాహ్మణ టీడీపీ నాయకులు



**నందిగామ, మే 27, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బ్రహ్మశ్రీ వేమూరి ఆనంద్ సూర్య నేతృత్వంలో పార్టీ దేవుని గడప కడప లో నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో బ్రాహ్మణ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన కోర్ కమిటీ సభ్యుడు ప్రకాష్ నందిరాజు, సోషల్ మీడియా చీఫ్ కోఆర్డినేటర్ కాశీనాధుని సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## యోగ శిక్షణా తరగతులు



**కంచికచర్ల మే 27 మేజర్ న్యూస్ :** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 27 తేదీ మంగళవారం నుండి నుండి 30వ తేదీ శుక్రవారం వరకు ఉదయం గం.8.00 లకు, మధ్యానం గం.3.00లకు యోగా శిక్షణా తరగతులు నిర్వహించారు. యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా కంచికచర్ల మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అందరికీ యోగాలో శిక్షణ తరగతులు జరుగుతున్నట్లు మండల అభివృద్ధి అధికారి లక్ష్మి కుమార్ తెలిపారు.





## యోగా శిక్షణా తరగతులు

**మొవ్వ (మే 27) మేజర్ న్యూస్:** 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రమైన మొవ్వ శ్రీ క్షేత్రయ్య కళ్యాణ మండపంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగ వల్ల మానవునికి ఆరోగ్యంతో పాటు ఉల్లాసం ఆలోచన శక్తి పెంపొందుతొందని యోగ గురువులు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరు ఎంపీడీఓ కార్యాలయంలో యోగాంధ్ర శిక్షణ



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం యోగ శిక్షణ నిర్వహించారు. మండల పరిషత్ అధికారి టి విజయ సారథి, తహశీల్దార్ బి లోకరాజు ఆధ్వర్యంలో యోగ డే కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, గ్రామీణ శిక్షకులు, ఎం ఎల్ హెచ్ పి లకు మాస్టర్ ట్రైనర్ అంగలూరు జడ్పీహెచ్ స్కూల్ పిడి సంధ్యారాణి యోగాంధ్ర శిక్షణా తరగతి నిర్వహించడం జరిగింది. అదేవిధంగా ఐదు రోజులు పాటు గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు గ్రామీణ శిక్షకులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు, ఆసక్తిగల వారందరూ మండల పరిషత్ కార్యాలయము వద్ద హాజరు కావాలని ఎంపిడిఓ టి.విజయసారధి కోరారు.

## కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం



**పమిడిముక్కల మే 27 మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పమిడిముక్కల లోని మూడవ నెంబర్ అంగన్వాడి కేంద్రంలో మంగళవారం కిషోర్ బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి సిహెచ్.నాగభవాని పాల్గొని పలు అంశాలపై కిశోర బాలికలకు అవగాహనను కల్పించారు. ప్రధానంగా లింగ వివక్షత, పౌష్టికాహారం, నాణ్యమైన విద్య, ఋతుస్రావ పరిశుభ్రత, లైంగిక వేధింపుల నుండి రక్షణ పొందటం, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు తదితర అంశాలను విసశదీకరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ బి.ఉష, అంగన్వాడి కార్యకర్తలు, ఆశ వర్కర్లు, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.




## 2024-25 ఒలింపియాడ్ అవార్డుల్లో విజయవాడ విద్యార్థుల ప్రతిభ

**విజయవాడ, మేజర్ న్యూస్:** నగరానికి చెందిన ముగ్గురు విద్యార్థులు 2024-25 సంవత్సరానికి ఎస్ఓఎఫ్ ఒలింపియాడ్ పరీక్షలో అగ్రస్థానంలో నిలిచారు. అట్కిన్సన్ హైస్కూల్ విద్యార్థి జి గౌతమ్ రెడ్డి ఇంటర్నేషనల్ సోషల్ స్టడీస్ ఒలింపియాడ్‌లో మొదటి ర్యాంక్ సాధించి, బంగారు పతకం, మెరిట్ సర్టిఫికెట్ పొందారు. అట్కిన్సన్ హైస్కూల్ విద్యార్థిని సిహెచ్ కావ్యశ్రీ కూడా అంతర్జాతీయ సోషల్ స్టడీస్ ఒలింపియాడ్‌లో మొదటి ర్యాంక్‌ను సాధించి, బంగారు పతకం, మెరిట్ సర్టిఫికెట్ ను అందుకున్నారు. ఎన్. సెయింట్ మాథ్యూస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి భువన్ సహర్ష్ జె, అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్‌లో కూడా మొదటి ర్యాంక్‌ను సాధించి, బంగారు పతకం, మెరిట్ సర్టిఫికెట్ ను పొందారు. 2024-25 విద్యా సంవత్సరంలో అంతర్జాతీయ ఒలింపియాడ్ విజేతలు, ఉపాధ్యాయులను గుర్తించడానికి ఎస్ఓఎఫ్, ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఒక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించింది. భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.కె. మహేశ్వరి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

## బదిలీల జీవోలోని అసంబంధాలను సరి చేయండి

### ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం

**విజయవాడ, మేజర్ న్యూస్:** ఉపాధ్యాయుల బదిలీల జీవో లోని అసంబద్ధాలను సరిచేసి బదిలీల ప్రక్రియ సజావుగా సాగేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్ది బాబు రాజేంద్రప్రసాద్ ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు కోరారు. ఎస్జిటిగా డీఎస్సీలో సెలక్ట్ అయిన ఉపాధ్యాయులు ప్రభుత్వ అనుమతి తీసుకుని తదుపరి డిఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ గా ఎంపిక అయిన సందర్భంలో ఎస్జీటీ సర్వీసును పరిగణనలోకి తీసుకోకపోవడం వలన బదిలీలలో తీవ్రంగా నష్టపోతున్నారని వారికి న్యాయం చేయాలని కోరారు. ఎనిమిది విద్యా సంవత్సరాలు నిబంధన వలన కంపల్సరీ ట్రాన్స్ఫర్ పరిధిలోకి వచ్చే వారికి 8 సం.లకు పూర్తి పాయింట్లను కేటాయించాలన్నారు. అన్ ట్రైన్డ్ ఉపా ధ్యాయులను వారి ఎంపికైన డీఎస్సీలో సీనియారిటీ జాబితాలో పరిగణనలోకి తీసుకొని చూపించవలసిందిగా కోరారు లేకపోతే వారు సీనియారిటీని నష్టపోవాల్సి వస్తుందని తెలియజేశారు..ఎస్జిటిలకు మాన్యు వల్ కౌన్సిలింగ్ జరిపేల స్పష్టమైన ఆదేశాలు వెంటనే జారీ చేయాలని కోరారు. రీఅపార్షన్మెంట్ కు గురవుతున్న ఉపాధ్యాయులకు 2021 కు ముందున్న స్టేషన్ పాయింట్లు ఇవ్వాలని కోరారు.ఆన్లైన్లో ఎదురవుతున్న టెక్నికల్ సమస్యలను సరిచేసి బదిలీల ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని కోరారు.

## ఐక్యూ నుంచి ఐక్యూ నియో10 లాంచ్



**గుంటూరు, మే 27, మేజర్ న్యూస్ :** హై పెర్ఫార్మెన్స్ స్మార్ట్ ఫోన్ బ్రాండ్ ఐక్యూ తన లేటెస్ట్ పవర్ హౌస్ ఐక్యూ నియో 10ను లాంచ్ చేసింది. యువ నిపుణుల నుండి భారీ-పనితీరు వినియోగదారుల వరకు యువత కోసం రూపొందించబడింది. ఇది దాని మార్గదర్శక డ్యూయల్-చిప్ ఆర్కిటెక్చర్, మెరుగైన శీతలీకరణ వ్యవస్థ, మొదటి ఆవిష్కరణలతో ఈ విభాగంలో కొత్త బెంచ్మార్కు సెట్ చేస్తుంది. ఐ క్యూ నియో10 భారతదేశపు మొట్టమొదటి స్నాప్డ్రాగన్? 8ఎస్ జెన్ 4 చిప్సె ట్తో వస్తుంది, శక్తివంతమైన 7000 ఎంఏహెచ్ బ్యాటరీని స్లిమ్ డిజైన్లో ఏకీకృతం చేస్తుంది. ఐక్యూ నియో10 8+128 జిబి వేరియంట్ ధర రూ.31,999 (నికర ప్రభావవంతమైన ధర: రూ 29,999), 8o256 వేరియంట్ ధర రూ.33,999(నికర ప్రభావవంతమైన ధర:రూ.31,999), 12+256 జిబి వేరియంట్ ధర రూ.35,999(నికర ప్రభావవంతమైన ధర: రూ.33,999), 16+512 జిబి వేరియంట్ ధర రూ.40,999(నికర ప్రభావవంతమైన ధర: రూ.38,999). ఇది ఇన్ఫెర్నో రెడ్, టైటానియం క్రోమ్ అనే రెండు రంగులలో లభిస్తుంది. అదనంగా, ఐక్యూ నియో 10 ఈరోజు నుండి ప్రీ-బుకింగ్ కోసం అందుబాటులో ఉంది, జూన్ 3, మధ్యాహ్నం 12 గంటల నుండి ఐక్యూ ఈ స్టోర్, అమెజాన్.ఇన్ లో అమ్మకం ప్రారంభమవుతుంది. ఐక్యూ నియో 10 ను ప్రీ-బుక్ చేసుకునే కస్టమర్లు ఉచిత ఐక్యూ టిడబ్ల్యూయస్ 1ఇని అందుకుంటారు.



## పులిగడ్డ ఉచిత కంటి వైద్య వైద్య శిబిరం

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పులిగడ్డ పంచాయతీ కార్యాల యం వద్ద ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించింది. బుధవారం ఉదయం రేపల్లె కు చెందిన శ్రీ సాయి కంటి హాస్పి టల్ వారు నిర్వహించిన వైద్య శిబిరంలో కంటికి సంబంధించిన పలు రుగ్మ తలకు పరీక్షలు నిర్వహించారు. ప్రధానంగా దగ్గర చూపు, దూరపు చూపు సమస్యలు, శుక్లాల నిర్ధారణ పరీక్షలు చేసి కంటి సమస్యల వలన వచ్చే తలనొప్పులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి కళ్ళజోళ్లను తక్కువ ధరకు అందజేశారు. సర్పంచ్ డాక్టర్ దాసరి విజయ్ కుమార్, సెక్రెటరీ బి అనిత లో నేతృత్వంలో జరిగిన ఈ శిబిరంలో డాక్టర్ ఎ. కిషోర్ కుమార్ (ఆప్తమాలజీ), ఎస్ రాజేష్, కే కార్తీక్, ఎస్ నాగలక్ష్మి లు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, వార్డ్ సభ్యులు చెన్ను రమేష్, మండలి శేషు, లీలా కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎం పీడీవో మరియాదేవి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సంద ర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం యోగా శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయ సిబ్బందికి యోగా శిక్షకులు కోటేశ్వరరావు, పీఈటీలు శ్రీకాంత్ ఉదయ్ లు యోగాలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గుడిసేవ విష్ణు ప్రసాద్ డాక్టర్ వంగర శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలి

### అంగలూరు అంగన్వాడీలో కిశోర వికాసం శిక్షణ



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలం, అంగలూరు గ్రామంలో కిశోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం డిసిపియు కాన్సిలర్ ఐ.స్వరాజ్యం అధ్యక్షతన నిర్వహించారు. ఈ రోజు సైబర్ నేరాలు, ఆన్లైన్ భద్రత,, వివిధ సమస్యలను ఏవిధంగా ఎదుర్కొంటున్నారో వివరించారు. ఆన్లైన్ వల్ల, సెల్ ఫోన్ వలన జరిగే నష్టాల గురించి, సైబర్ నేరాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ గుడ్లవల్లేరు సూపరైజర్ ఇ. వాణి, అంగలూరు ఆషా, అంగన్వాడి కార్యకర్తలు, సహాయకులు పాల్గొనడం జరిగింది.

## యువకుడి కంటి ఆపరేషనుకు 10వేల సహాయం



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలం విన్నకోట గ్రామంలో గల మెండెం రవికిరణ్ (19) ఈ నెల 8న జరిగిన ట్రాక్టర్ యాక్సిడెంట్ లో మెడ నారాలకు దెబ్బతగిలి తన కన్ను కదలడంతో ఆపరేషన్ చేయాలని డాక్టర్ విజ యవాడ రిఫర్ చేసారు. తనకు అమ్మ లేదు.నాన్న అమాయకుడు. హాస్పటల్‌కి వెళ్ళటానికి కూడా డబ్బులు లేని పరిస్థితనే సమాచా రం తెలుసుకుని గ్రూపు వాలంటీర్ తో గుడ్లవల్లేరు నవ ఆశయం జైభీమ్ గ్రూపు నుండి ఆపరేషన్ నిమిత్తం 10 వేల రూపాయల ఆర్థిక సహాయం తండ్రికి అందచేయడం జరిగిందని దాసి సత్యనారాయణ తెలిపారు.

# నిర్ధిష్ట ప్రణాళికలతో ముందుకు సాగుతున్న పార్టీ తెలుగుదేశం పార్టీ

## మచిలీపట్నం మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ కుంచె నాని



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కష్టాల్లో ఉన్న కార్యకర్తలను గుర్తించే ఏకైక పార్టీ తెలుగుదేశం అని మచిలీపట్నం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కుంచే దుర్గా ప్రసాద్ నాని అన్నారు. కడప గడ్డపై జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడు వేదికపై తొలి రోజు 'కార్యకర్తల సంక్షేమం' అనే అంశంపై ఆయన ప్రసంగిం చారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని బలం కార్యకర్తల రూపంలో టీడీపీకి ఉందన్నారు. కార్యకర్తలను గుర్తించే ఏకైక పార్టీ తెలుగుదేశం అని అన్నారు. కష్టాల్లో ఉన్న కార్యకర్తను ఆదుకునే పార్టీ కూడా తెలుగుదేశమే అని, అందుకు తానేనన్నారు. గత ప్రభుత్వంలో పేర్ని నాని తనపై అనేక తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపినా బెయిల్ ఇచ్చి బయటకు తీసుకువచ్చింది పార్టీనే అని భావోద్వేగంతో అన్నారు.

కార్యకర్తలను వాడుకుని వదిలేసే పార్టీ టీడీపీ కాద ని, వారి సంక్షేమానికి పాటుపడే పార్టీ అని అన్నారు. నారా చంద్రబాబు నా యుడు, నారా లోకేష్ కార్యకర్తల సంక్షేమం కోసం సంక్షేమ నిధి ద్వారా ఎం తో మంది కార్యకర్తలను ఆదుకుంటున్నారన్నారు. ఎన్టీఆర్ మెమోరియల్ ద్వా రా ఎంతో మంది పేద కార్యకర్తల పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పుతున్నా రన్నారు. గ్రామ స్థాయి నుండి నిర్ధిష్టమైన ప్రణాళికలతో ముందుకు సాగుతు న్న పార్టీ కూడా తెలుగుదేశం పార్టీనే అన్నారు. మచిలీపట్నంలో ఏ ఒక్క కార్య కర్తకు కష్టం రాకుండా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొల్లు రవీంద్ర చూసుకుంటు న్నారన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడం వల్ల 53వేల ఓట్ల మెజార్టీతో కొల్లు రవీంద్రను గెలిపించుకున్నామని మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కుంచే నాని తెలిపారు.



## మహానాడుకు తరలిన వీరులపాడు టీడీపీ శ్రేణులు

**వీర్లపాడు, మే 27, మేజర్ న్యూస్:** దేవుడి గడప కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి వీరులలపాడు మండలం వెల్లంకి, గోకరాజుపల్లి, బోడవాడ గ్రామాల నాయుకులు భారీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమం లో మల్లెల శ్రీనివాసరావు, మద్దినేని లక్ష్మణరావు, మల్లెల శ్రీ కృష్ణ వాసు, చంద్రా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధూళిపూడి మునేశ్వరరావు సైకిల్ యాత్రకు నీరాజనాలు పడుతున్న తెలుగు తమ్ముళ్లు

**కోదూరు మేజర్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ వీర అభిమాని ధూళిపూడి మునే శ్వర రావు చేపట్టిన సైకిల్ యాత్రకు తెలుగు తమ్ముళ్లు నీరాజనాలు పడుతు న్నారు. తెలుగుదేశం పార్టీ కోదూరు మండల అధ్యక్షులు, మాజీ జడ్పిటిసి సభ్యులు బండే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కడపలో జరిగే మహానాడుకు కోదూరు నుండి కడప సైకిల్ యాత్ర మునేశ్వరరావు చేపట్టారు. సైకిల్ యాత్రలో భాగంగా మునేశ్వరరావు మంగళవారం ఉదయం కందుకూరులోని కోపూరు నియోజకవర్గంలో గల కొల్లేటి మండలం చేరుకున్నారు. మహానా డుకు సైకిల్ పై బయలుదేరిన మునీశ్వర రావుకు అడుగడుగున తెలుగు తమ్ముళ్లు నీరాజనాలు పట్టారు. సైకిల్ యాత్రలో భాగంగా మార్గమధ్యంలో తమ గ్రామానికి వచ్చిన మునీశ్వరరావుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికి, అభినందించారు...

## జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలించిన డి.ఎస్.పి



**పామర్రు మే 27 మేజర్ న్యూస్:** మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారిపై తరచుగా ప్రమాదాలు జరుగుచున్న ప్రాంతాలను గుడివాడ సబ్ డివిజన్ పోలీస్ అధికారి వి.ధీరజ్ వినీల్ మంగళవారం పరిశీలించారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న పామర్రు, పమిడిముక్కల, కూచిపూడి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో గల జుజ్జువరం, కొం డిపర్రు అడ్డరోడ్డు, బల్లిపర్రు, కురుమద్దాలి పెట్రోల్ బంక్, కనుమూరు, గోపువానిపాలెం, నిడుమోలు ప్రాంతాలలో ఆయన తనిఖీ చేశారు. పామర్రు సీఐ వి.శుభాకర్ నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రదేశాలలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తగు సూచనలు అందించారు. అలాగే జాతీయ రహదారుల శాఖకు చెందిన ఇంజనీర్లతో మాట్లాడి ఆయా ప్రదేశాలలో బ్లింక్ లైట్లు, ప్రమాద హెచ్చరిక సూచనలు చేయు బోర్డులు, బ్లాక్ స్పాట్ కి సుమారు 500 మీటర్ల నుండి ప్రమాదం జరిగే ప్రదేశం ఉన్నది అని తెలిపే బోర్డులు ఏర్పాటు చేయవలసిందిగా ఆయా అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పామర్రు సిఐ వి.శుభాకర్, కూచిపూడి ఎస్సై కె.నాగ విశ్వనాథ్, పామర్రు ఎస్సై వి. రాజేంద్రప్రసాద్, పమిడిముక్కల ఎస్సై బి.శ్రీను పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయంలో యోగాంధ్ర మాసోత్సవం




**పెనుగంచిప్రోలు, మే 27, మేజర్ న్యూస్ :** యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా పెనుగంచిప్రోలు మండలపరిషత్ కార్యాలయంలో యోగాంధ్రలో రిజిస్టర్ అయిన సచివాలయం స్టాఫ్ కు ఉదయం 7 గం ల నుండి 8 గం ల వరకు యోగ శిక్షణ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో.జి. శ్రీను సిద్ధారె డ్డి సచివాలయస్టాఫ్ పాల్గొన్నారు. ఆయుస్మాన్ డాక్టర్స డి.కొల్లూరు వాణి, డాక్టర్ దుర్గా మల్లేశ్వరరావు యోగ మెలకువలు గురించి తెలియజేసారు, అనంతరం యోగాంధ్ర గురించి ర్యాలీ జరపడమైనది ఉదయం 11 గం లకు జి ఎస్ డబ్ల్యూ ఎస్ డైరెక్టర్, ఆయుష్ డిపార్ట్మెంట్ వారి ద్వారా యోగంధ్ర గురించి వీడియో కాన్ఫరెన్స్ జరిగినది, ఈ వీడియో కాన్ఫరెన్స్ కి మండల స్థాయి అధికారులు, సచివాలయం స్టాఫ్ హాజరైనారు, అని ఎంపీడీవో జీ శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు.

## దాతల సహకారంతో భక్తులకు మజ్జిగ పంపిణీ



**పామర్రు మే 27 మేజర్ న్యూస్ :** పామర్రు మండల పరిధిలోని ఉంద్రపూడి - పోలవరం అడ్డ రోడ్డు వద్ద గల శ్రీ వీరాంజనేయ స్వామి దేవ స్థానంలో దాతల సహకారం తో మంగళవారం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఉం ద్రపూడి గ్రామానికి చెందిన గంధం వెంకట రమేష్ దాతృత్వంతో అందించిన 120లీటర్ల మజ్జిగను ఆలయ కార్యనిర్వహణాధికారి పి.వి.ఎన్.వి.ప్రసాదరావు పర్యవేక్షణలో భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత వెంకట రమేష్ ను కార్య నిర్వహణ అధికారి ప్రసాదరావు సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు.

### ఈనెల 29న హుండీ లెక్కింపు

ఈనెల 29వ తేదీన ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఆలయ హుండి లెక్కింపు జరుగుతుందని కార్యనిర్వహణాధికారి ప్రసాదరావు తెలిపారు. దేవాదాయ శాఖ అధికారులు, ఆసక్తి కలిగి హాజరైన భక్తుల సమక్షంలో ఈవో ప్రసాదరావు హుండీలను తెరుస్తారని, అనంతరం లెక్కింపు కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆలయానికి భక్తులు అందించిన ధాన్యం, బియ్యం, మినుములు టెండర్ కం బహిరంవేలం జరుగుతుందని ప్రసాదరావు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ పాటలో పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.



# 8 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి

## జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈ నెలాఖరికి జిల్లాలోని 6 స్టాక్ పాయింట్లలో 8 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ డికే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. స్టాక్ యార్డ్ వద్ద ప్రజలు ఇసుక కొనుగోలు చేయుటకు వీలుగా కలెక్టర్ అధికారులతో చర్చించి ధరలు నిర్ధారించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వచ్చే వర్షాకాలానికి ప్రజల అవసరాల కోసం 8 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను ఎంపిక చేసిన 6 స్టాక్ పాయింట్లలో నిల్వ చేయాలనేది లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. అందులో భాగంగా 6 స్టాక్ పాయింట్లలో చోడవరం, నార్త్ వల్లూరు, పడమటలంక, రొయ్యూరు, రొయ్యూరు సెమీ మేకనైజేడు, శ్రీకాకుళం స్టాక్ పాయింట్ల వద్ద ఇప్పటికే 6,15,987 మెట్రిక్ టన్నులను ప్రజలకు అందుబాటులో సిద్ధంగా ఉంచడం జరిగిందన్నారు. ఈ నెలాఖరికి 8 లక్షల మెట్రిక్ టన్నుల పూర్తిస్థాయి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. మెట్రిక్ టన్ను ఇసుక 155 రూపాయలుగా నిర్ధారించామని ప్రజలు ఎవరైనా సరే ఆ ప్రకారం పైకం చెల్లించి ఇసుకను తమ ఇంటి అవసరాలకు తీసుకొని వెళ్ళవచ్చన్నారు. సంయుక్త కలెక్టర్ నేతృత్వంలో గనులు, పోలీసు,జలవనరుల శాఖ అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నామని, ఆ కమిటీ ఈనెల 31వ తేదీన అన్ని స్టాక్ యార్డులను తనిఖీ చేసి అక్కడ భౌతికంగాఎంత ఇసుక నిల్వ ఉన్నదో వివరాలు సేకరించి నివేదిక అందజేయాలన్నారు. అంతేకాకుండా ఇసుక స్టాక్ యార్డులను యార్డులనులను తరచూ పోలీస్ వారు తనిఖీ చేసి బీట్ పుస్తకంలో సంతకం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి సత్యనారాయణ, గనులు భూగర్భవనరులు శ్రీనివాస్ కుమార్, ఏజీ కొండారెడ్డి, భూగర్భ జల శాఖ ఏడి జయవర్ధన్, ఆర్టీవో శ్రీనివాస్ రావు, జలవనరుల శాఖ కేసీ డివిజన్ ఈఈ రవి కిరణ్, జీఎస్టీ సహాయ కమిషనర్ వెంకటేశ్వరరావు, డిఎస్పి సిహెచ్ రాజా తదితర అధికారులు పాల్గొన్నారు.

# కోనేరు సెంటర్లో అల్పాహారం పంపిణీ చేసిన శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కోనేరు సెంటర్లో అల్పాహారం పంపిణీ చేసిన,శ్రీ కామాక్షి మచిలీపట్నం స్వర్ణకార సంఘ ఆధ్వర్యంలో అమావాస్య సెలవు దినాన్ని పురస్కరించుకొని మానేపల్లి దుర్గారావు నండూరి చంద్రమౌళి సౌజన్యంతో కోనేరు సెంటర్ లో స్వర్ణకారులు పురప్రజలకు అల్పాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్వర్ణకారసంఘం నాయకులు గడ్డంరాజు మాట్లాడుతూ మచిలీపట్నం స్వర్ణకార సంఘం అధ్యక్షులు మానేపల్లి దుర్గారావు నేతృత్వంలో కోనేరు సెంటర్లో పుర ప్రజలకు అల్పాహారం అందించారన్నారు కరోనా విపత్కర పరిస్థితిలో శ్రీ కామాక్షి మచిలీపట్నం స్వర్ణకార సంఘం సమాజ సేవలో నేను సైతం అంటూ పేదవారికి నిత్య అవసరాలు పంపిణీ చేసి కరోనా బారిన పడిన పేద ప్రజలకు తమ వంతు ఆర్థిక సాయంతో పాటు ఉచితంగా వైద్యాన్ని అందించి శ్రీకామాక్షి మచిలీపట్నం స్వర్ణకార సంఘం నాయకులు మానవత్వాన్ని చాటుకున్నారని గడ్డంరాజు పేర్కొన్నారు.శ్రీ కామాక్షి మచిలీపట్నం స్వర్ణకార సంఘం అధ్యక్షులు మానేపల్లి దుర్గారావు మాట్లాడుతూ అమావాస్య సెలవును పురస్కరించుకొని దాతల సహకారంతో ప్రతి అమావాస్యకు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు ఈరోజు 500 మందికి పైగా అల్పాహారం పంపిణీ జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార నాయకులు వాసా బత్తుల శ్రీనివాస్, శేషుబాబు,పెంట శ్రీనుదేవుకనక రత్నాచారి, గంగాధర్, రఘు, సాయి, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

## మన నిత్యం యోగా చేయడం వల్ల శరీరం తేలిగ్గా మారుతుండీ




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మంగళవారం మచిలీపట్టణం మండలంలోని కానూరు పంచాయతీలో కృష్ణ జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో యోగ యొక్క ప్రాముఖ్యత గురించి ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం గోపు సత్యనారాయణ మాట్లాడుతూ వచ్చేనెల 21వ తారీఖున విశాఖపట్నంలో జాతీయ యోగ డే సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వస్తున్నారని అయన అన్నారు. మన నిత్యం యోగా చేయడం వల్ల శరీరం తేలిగ్గా మారుతుందని,శక్తి స్థాయిలు పెరుగుతాయని,నాడీ వ్యవస్థకు యోగా అనేది చాలా మంచిదని, ప్రాణాయామం ద్వారా ఊపిరితిత్తుల సామర్థ్యం పెరిగి శరీరంలో ఆక్సిజన్ సరఫరా మెరుగుపడుతుందని, రోజూ యోగా చేయడం అలవాటు చేసుకుంటే రక్తపోటు నియంత్రణలో ఉంటుందని, హృదయ సంబంధిత జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుందని అయన అన్నారు.సదరు ప్రోగ్రాంకి దివి మహేష్, బొమ్మిడి పెద ఏడుకొండలు, గోపు వెంకటరమణ,పంచాయితీ సెక్రెటరీ వెంకటేశ్వరరావు, వీఆర్వో గోవిందరాజులు,బొమ్మిడి కొండా, ఈవన యేసు, బోట్ల సాయి,అంగన్వాడీ కార్యకర్తలు,ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్, ఏ ఎన్ ఎంలు, ఆశ వర్కర్స్, సచివాలయ సిబ్బంది మొదలగు వారు పాల్గొన్నారు.



## యోగా శిక్షకులకు శిక్షణ






**పమిడిముక్కల మే 27 మేజర్ న్యూస్ :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణకు నమోదైన గ్రామీణ శిక్షకులకు మంగళవారం శిక్షణా తరగతులు జరిగాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 80 మంది శిక్షకులుగా నమోదు కాగా వారికి రేపల్లె శ్రీధర్ శిక్షణను అందించారు. యోగాలో వివిధ రకాలైన ఆసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు వంటి ఆసనాలు చేసే విధానాన్ని ఆయన వీరికి ప్రయోగాత్మకంగా వివరించారు. వీటిపై శిక్షణ పొందిన వారు ఆయా గ్రామాల్లో ఆసక్తి కలిగినవారికి యోగాను నేర్పవలసి ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఎండిఓ వీర్ల సీతారామరాజు, మండల పరిషత్ కార్యాలయం ఏవో జి.రామకృష్ణ, ఈవోఆర్డి వెంకటేశ్వరరావు, మండలంలోని పంచాయతీల కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది, నమోదైన శిక్షకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సెంటర్లో మానవహారం ఏర్పాటు చేశారు.

## కిశోర బాలికలకు సైబర్ నేరాలపై అవగాహన



**పెదపారుపూడి మే 27 మేజర్ న్యూస్ :** పెదపారుపూడి మండల పరిధిలోని భూషణగుళ్ళ గ్రామంలోని అంగన్ వాడి కేంద్రంలో మంగళవారం కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు జరిగే విధానం, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి కిశోర బాలికలకు వివరించారు. అలాగే మొబైల్ యాప్స్ ఉపయోగించడం వల్ల జరిగే నష్టాలను వారికి తెలియపరిచారు. మొబైల్ లో యాప్ లను వినియోగించేటప్పుడు ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి సూపర్వైజర్ అరుణకుమారి, మహిళా పోలీసు నాగలక్ష్మి, ఏఎన్ఎం వాణి, ఆశా వర్కర్, విఓఎ తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు యోగాసనాలు అంశంపై అవగాహన



**పెదపారుపూడి మే 27 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని యలమర్రు శా ఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల లో భాగంగా మంగళవారం విద్యార్థులకు యోగాసనాలు అనే అంశం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి జె.విజయలక్ష్మి ఈ సందర్భంగా యోగాస నాలు వేసే విధానాన్ని విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సూచించారు. అలాగే యోగాసనాల వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్వజన ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది స్థానికంగా నివాసం ఉండాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది స్థానికంగా నివాసం ఉండే విధంగా చర్యలు తీసుకొని, తద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందే విధంగా చేయాలని, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత ను కృష్ణాజిల్లా బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు శేకుబోయిన సుబ్రమణ్యం కోరారు.అనంతరం సుబ్రమణ్యం మాట్లాడుతూ రోగులకు వైద్య సేవలు అందించవలసిన ప్రొఫెసర్లు, వైద్యులు, స్టాఫ్ నర్సులు స్థానికంగా నివాసం ఉండకపోవడంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందట్లేదని అభిప్రాయపడ్డారు. మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో కాకుండా,వేరే ఊర్లు, జిల్లాల్లో నివాసం ఉండడం చేత అత్యవసర సమయాల్లో రోగులకు అందుబాటులో లేకుండా, ఎక్కువ శాతం కేసులు విజయవాడకు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు.కాబట్టి వైద్య సేవలు అందించవలసిన సంబంధిత సిబ్బంది మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోనే నివాసం ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించవలసిందిగా కోరుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్, డిప్యూటీ సూపర్ ఇంటెండెంట్ శ్రీనివాస్,ఆర్.ఎం.ఓ నిరంజన్ లకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో బీ.సీ నాయకులు ఎం.అన్సారి, చేబోయిన కోటేశ్వరరావు, బోయిన రమేష్, పెద్ది బోయిన సాంబ, ఎం.పవన్, ఎస్సీ నాయకులు పాల్గొనడం జరిగింది.

## పామర్రు వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు



**పామర్రు మే 27 మేజర్ న్యూస్ :** పామర్రు – గుడివాడ జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ వద్ద మంగళవారం సాయంత్రం పామర్రు పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. స్థానిక ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో స్టేషన్ సిబ్బంది పాల్గొని వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల ఇన్సూరెన్స్, వాహనాలపై గతంలో ఉన్న చలానాలు తదితర అంశాలను పరిశీలించడంతో పాటు వాహనదారులకు హెల్మెట్ పై ఎస్సై రాజేంద్రప్రసాద్ అవగాహన కల్పించారు.

# తెలుగుదేశంలో కార్యకర్తే అధినేత

**పార్టీకి ప్రాణం, ఆయుధం కూడా కార్యకర్తలే**

**కార్యకర్తల త్యాగాలు వృథా కానివ్వం, అండగా ఉంటాం**

**అభివృద్ధి, సంక్షేమం, సంస్కరణలు, సుపరిపాలనకు టీడీపీనే ట్రెండ్ సెట్టర్**

**'స్టేట్ ఫస్ట్' మన సంకల్పం- 'పాజిటివ్ పాలిటిక్స్' మన విధానం**

**బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం అందించిన ఏకైక పార్టీ టీడీపీనే**

**45 రోజుల్లోనే కోటి సభ్యత్వాలు నమోదు చేసి రికార్డ్ సృష్టించాం**

**1982 నుంచి నిన్నటి విధ్వంస పాలన వరకు మనది రాజీలేని పోరాటం**

**టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు**

**వచ్చే ఎన్నికల్లో కడపలో 10కి 10 అసెంబ్లీ స్థానాలు గెలుద్దామని పిలుపు**





**విజయవాడ, మేజర్ న్యూస్ :** కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అసలు సిసలైన అధినేతలని, పార్టీకి ప్రాణం-ఆయుధం కూడా కార్యకర్తలేనని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విధ్వంస పాలకులను ఎదురొడ్డి పోరాడిన కార్యకర్తల త్యాగాలు వృథా కానివ్వమని, వారికి అండగా ఉండి సంక్షేమం అందిస్తామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం, సంస్కరణలు, సుపరిపాలనకు టీడీపీనే ట్రెండ్ సెట్టర్ అని, రాష్ట్రం ఫస్ట్ మన సంకల్పమని, పాజిటివ్ పాలిటిక్స్ మన విధానమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఒక ప్రాంతీయ పార్టీగా 45 రోజుల్లోనే కోటి సభ్యత్వాలు నమోదు చేసి రికార్డ్ సృష్టించిన ఏకైక పార్టీ తెలుగుదేశమని అన్నారు. 1982లో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం మొదలు... నిన్నటి విధ్వంస పాలన వరకూ రాజీలేని పోరాటంచేశామన్నారు. మంగళవారం కడపలో జరిగిన మహానాడు తొలిరోజు సమావేశంలో ప్రారంభోపన్యాసాన్ని జై తెలుగుదేశం, జోహార్ ఎన్టీఆర్ నినాదాలతోముఖ్యమంత్రి చంద్రబాబు మొదలుపెట్టారు. అంతకు ముందు, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించి, జ్యోతిని వెలిగించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ క్యాడర్‌ను ఉద్దేశించి ఉద్వేగంగా ప్రసంగించారు.

**ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోతుంది**

ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా మహానాడు అంటే అదే జోరు. అదే హోరు. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే నా మనసు ఉప్పొంగుతోంది. నాకు ప్రాణసమానమైన తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులందరికీ స్వాగతం. దేశంలో అనేక రాజకీయ పార్టీలున్నాయి. మహానాడులా వేలాదిమంది ప్రతినిధులతో మంచిచెడులు, విధానాలు, ఆలోచనలు చర్చించుకునే ఏకైక పార్టీ మాత్రం తెలుగుదేశమే. రాయలసీమలో మహానాడు అంటే తిరుపతిగా ఉండేది. తొలిసారి దేవుని కడపలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలి మహానాడు కడపలో ఏర్పాటు చేశాం. కడప గడ్డపై ఈ మహానాడు చూస్తుంటే ఎన్నికలు అయ్యి ఏడాదైనా కార్యకర్తల్లో ఆ కసి, ఉత్సాహం, ఉద్వేగం ఏమాత్రం తగ్గలేదు. ఉమ్మడి కడపలో 10 కి ఏడుస్థానాలు గెలిచి సత్తాచాటాం. ఈసారి మరింత కష్టపడితే 10కి 10 మనవే.ఇప్పటి వరకూ మనం 34 మహానాడులు జరుపుకున్నాం. ఈ మహానాడు సువర్ణాక్షరాలతో చరిత్ర సృష్టించబోతోంది. ఏపీ ఆర్థిక పరిస్థితికి దశ దిశ నిర్దేశిస్తుంది. గతంలో మహానాడు అంటే ఎండలు మండేవి. ఈసారి చల్లటి వాతావరణంలో మహానాడు జరుగుతోంది.

**కార్యకర్తల పోరాట ఫలితమే ఈ అద్భుత విజయం**

2024 ఎన్నికల్లో పార్టీ సాధించిన విజయం అసామాన్యం. 93 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్ షేర్‌తో చరిత్ర సృష్టించామంటే అందుకు పసుపు సైనికుల పోరాటం, త్యాగాలే కారణం. జనసేన, బీజేపీతో కలిసి పోటీ చేయడం ఈ మహా విజయానికి దోహదం చేసింది. ఏమీ ఆశించకుండా దశాబ్దాలుగా గ్రామాల్లో జెండా మోస్తున్న కార్యకర్తల వల్లే ఇక్కడ ఉన్నాం. దీన్ని ప్రతి నేత కూడా గుర్తుంచుకోవాలి. 43 ఏళ్ల ప్రస్థానంలో దేశంలో ఏ పార్టీ ఎదుర్కోని సంక్షోభాలు ఎదుర్కొన్నాం. పార్టీ పని అయిపోయిందని మాట్లాడినవారి పనే అయిపోయింది కానీ టీడీపీ జెండా రెపరెపలాడుతూనే ఉంది. నాటి ఎన్టీఆర్ చైతన్య రథం, నేను చేసిన వస్తున్నా మీకోసం పాదయాత్ర, లోకేష్ యువగళం వరకూ కార్యకర్తల్లో అదే స్ఫూర్తి.

**గొంతు కోసినా జై తెలుగు దేశం అన్నారు**

పాలన అంటే హత్యా రాజకీయాలు, కక్ష సాధింపులు, వేధింపులు, తప్పుడు కేసులుగా గత పాలకులు మార్చారు. విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. దీన్ని ప్రశ్నించిన టీడీపీ నేతలు, కార్యకర్తలను వెంటాడి వేటాడి ప్రాణాలు తీశారు. అక్రమ కేసులు పెట్టి వేధించారు. కానీ ఒక్క కార్యకర్త కూడా ఎత్తిన జెండా దించలేదు. ప్రశ్నించినవారి గొంతునొక్కేందుకు గొంతులు కోశారు. మన పసుపు సింహం చంద్రయ్య గొంతు కోస్తున్నా జై తెలుగుదేశం అని ప్రాణాలు వదిలాడు. ఎందరో కార్యకర్తలు ప్రాణత్యాగాలు చేశారు. వారి స్ఫూర్తి టీడీపీలో శాశ్వతంగా ఉంటుంది. ఎత్తిన జెండా దించని కార్యకర్తల త్యాగాల వల్లే కూటమి అధికారంలోకి వచ్చింది. మీ త్యాగాలకు మహానాడు వేదికగా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. మీ త్యాగాలు వృథా కానివ్వం. కార్యకర్తల కష్టాలను గుర్తిస్తాం. సంక్షేమం అందిస్తాం. వర్షాలు వస్తున్నా మహానాడు జయప్రదం చేయాలని వచ్చిన కార్యకర్తలను చూస్తుంటే ఆనందంగా ఉంది.

**పాలనలో టీడీపీ ట్రెండ్ సెట్టర్**

దేశంలో అనేక పార్టీలు ఉన్నాయి. కానీ ప్రజల జీవితాలను ఇంతలా ప్రభావితం చేసిన పార్టీ మాత్రం టీడీపీనే. అటు తెలంగాణ నుంచి ఇటు ఉత్తరాంధ్ర వరకూ అభివృద్ధి అంటే టీడీపీ ఆవిర్భావం ముందు, తర్వాతగా చూడాలి. ఇది చరిత్ర చెప్పిన వాస్తవం. సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలకు టీడీపీనే ట్రెండ్ సెట్టర్. టీడీపీ పాలనే బ్రాండ్ అంబాసిడర్. పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు నుంచి ఆడబిడ్డల ఆస్తి హక్కు వరకూ, బాలికా విద్యకు ప్రోత్సాహం నుంచి ప్రత్యేక మహిళా వర్సిటీ వరకూ, లోటు కరెంటు నుంచి మిగులు విద్యుత్ వరకూ రూ. 2 కే కిలో బియ్యం నుంచి పక్కా ఇళ్ల వరకూ, రూ.30 పింఛను నుంచి రూ.4 వేల పింఛను వరకూ, వంట కష్టాలను దీపం పథకం తప్పించడం నుంచి డ్వాక్రా సంఘాల సాధికారత వరకూ నిరుద్యోగ పరిస్థితులను నుంచి ఐటీ ఉద్యోగాలతో విదేశాల్లో సత్తా చాటే వరకూ, సీమలో రైతుల సాగునీటి కోసం తల్లడిల్లే పరిస్థితి నుంచి డ్రిప్ సబ్సిడీలతో సిరులు పండించే వరకూ, బడుగు బలహీన వర్గాలకు అధికారం చూపిన తొలి పార్టీ టీడీపీ. అడిగే పరస్థితి నుంచి బీసీలు శాసించే పరిస్థితికి తెచ్చిన ఏకైక పార్టీ తెలుగుదేశం. ఒక వర్గం, ఒక ప్రాంతం అని కాదు ఏ అంశమైనా పసుపు జెండా పుట్టకముందు పుట్టిన తర్వాత అని గీత గీసి చెప్పే పరిస్థితి. మనందరం టీడీపీ రాజకీయ పాఠశాలలో విద్యార్థులమే.

**నేను నిత్య విద్యార్థిని**

నేను నిత్య విద్యార్థిగా ఉంటాను. ప్రతిరోజూ నేర్చుకుని ప్రజలకు ఉపయోగపడతాను. కార్యకర్తలే నాకు ఆయుధాలు. మీరు నేనూ కలిస్తే ఆకాశమే హద్దుగా పనిచేయొచ్చు. పాజిటివ్ పాలిటిక్స్ మన విధానం, రాష్ట్రం ఫస్ట్ అనేది మన సంకల్పం. ప్రతిపక్షంలో అవినీతిపై పోరాడాము. అధికారంలోకి రాగానే అవినీతి రహిత పాలన అందిస్తున్నాము. ప్రజల ఆస్తులు, ప్రజల హక్కులకు రక్షణ కల్పించాం. ఇకపైనా చేస్తాం. భావితరాల భవిష్యత్ కు అవసమైన పాలసీలు తెచ్చాం. పాజిటివ్ పాలటిక్స్ తో రాజకీయాల్లో విలువలు పెంచిన పార్టీ టీడీపీనే. నేడు తెలుగు రాష్ట్రాల్లో వివిధ పార్టీల్లో టీడీపీ యూనివర్సిటీలో చదివిన విద్యార్థులే ఉన్నారంటే అదీ మన సత్తా. మనది మోస్ట్ సక్సెస్ ఫుల్ మోడల్. ప్రజలిచ్చిన తీర్పును ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రయోజనాలకే ఉపయోగించాం. సొంత అవసరాలకు వాడలేదు. వాడము. అదే టీడీపీ చిత్తశుద్ధి. మన పార్టీ విధానాలు, మన ఆలోచనలు దేశంలో ఇతర పార్టీలకు బ్లూ ప్రింట్ గా నిలిచాయి.

**సామాజిక న్యాయం టీడీపీతోనే సాధ్యం**

రాజకీయాల్లో సామాజిక న్యాయం టీడీపీ తెచ్చిన అతిపెద్ద విప్లవం. అట్టడుగు వర్గాలకు రాజకీయ అవకాశాలు ఇచ్చాం. 40 ఏళ్లకు ముందే బీసీలను రాజకీయాల్లో భాగస్వాములు చేశాం. ఇదే టీడీపీని తిరుగులేని శక్తిగా మార్చింది. మన తర్వాత దేశంలో అన్ని పార్టీలు బీసీలను గుర్తించే పరిస్థితి వచ్చింది. సంస్థాగతంగా దేశంలో బలమైన పార్టీ టీడీపీ. ఒక ప్రాంతీయ పార్టీగా పుట్టి కోటి సభ్యత్వాతలను 45 రోజుల్లోనే పూర్తి చేసిన ఏకైక పార్టీ టీడీపీ.

**జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర**

జాతీయస్థాయిలో కేంద్ర ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాల్లో టీడీపీ కీలకపాత్ర పోషించింది. వాట్ ఏపీ థింక్స్ టుడే... ఇండియా థింక్స్ టుమారో అనేది అనేక సార్లు నిరూపణ అయ్యింది. విద్యుత్ సంస్కరణలు, పీపీపీ విధానంలో మౌలిక సదుపాయాలు, ప్రజల వద్దకు పాలన, జవాబుదారీ వ్యవస్థ వంటివి దేశానికి పరిచయం చేశాం. ప్రస్తుత టెక్నాలజీ యుగంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా పార్టీ విధానంలో నూతనత్వం తీసుకొద్దాం. కడప గడ్డపై జరుగుతున్న మహానాడులో అనేక నిర్ణయాలు చర్చించి భావితరాల భవిష్యత్‌కు కార్యక్రమ రూపకల్పన చేస్తాం. ఈ మహానాడు భవిష్యత్‌ను ఒక దశదిశా నిర్దేశించే విధంగా ఉండబోతోంది.

**అభివృద్ధికి కేరాఫ్ ఏపీ కాబోతోంది**

స్వాతంత్రం వచ్చిన తర్వాత 78 ఏళ్లలో ఎంత అభివృద్ధి జరిగిందో రాబోయే 22 ఏళ్లలో అంతకుమించి రెట్టింపు అభివృద్ధి జరగబోతోంది. 2025 మహానాడు ఒక చరిత్ర తిరగరాయబోతోంది. మంత్రి లోకేష్ ఆరు శాసనాలతో ఒక బ్లూ ప్రింట్ విడుదల చేస్తారు. నేరస్థులు ఎక్కడున్నా వదిలిపెట్టే సమస్య లేదు. నదుల అనుసంధానం, పోలవరం పూర్తి చేసి జలహారతి ద్వారా ప్రతి ఎకరాకు నీరిచ్చి తెలుగు ప్రజల రుణం తీర్చేలా తీర్మానం చేస్తాం. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌కు నాంది పలుకుతాం. రోడ్లు, రైల్వే, పోర్టులు, ఎయిర్ పోర్టులు వంటివి చేసి ప్రపంచంలోనే లాజిస్టిక్ కాస్ట్ తగ్గేలా మన ఆలోచనలు ఉంటాయి. ఆ రోజు నేను హైటెక్ సిటీ నిర్మించి హైదరాబాద్‌లో ఐటీ తెచ్చాను. ఈ మహానాడు ద్వారా క్వాంటమ్ వ్యాలీ, ఏఐకి ప్రాధాన్యత ఇచ్చి తెలుగుజాతిని ముందుకు నడిపిస్తాను. ప్రధాని నాయకత్వంలో వికసిత్ భారత్ తయారుచేస్తే మనం స్వర్ణాంధ్ర 2047 తెచ్చాం. 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ ధ్యేయంగా పెట్టుకుని ప్రతి ఒక్కరి ఆదాయం రూ. 55 లక్షలు ఉండేలా కార్యక్రమం రూపకల్పన చేశాం. ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు పెరగాలి. 2047 నాటికి జీరో పావర్టీ సాధించి దేశానికి ఒక దశదిశ నిర్దేశిస్తాం. ఆ తర్వాత పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించే విధానానికి శ్రీకారం చుడతాం. అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండటం మన విధానం. రాబోయే పదేళ్లలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితినే కాదు మనం అనుకున్న విధానాలు అమలు చేసి వ్యవస్థనుగాడిలో పెట్టే బాధ్యత నాది. ప్రపంచంలోనే తెలుగు జాతి నెంబర్ వన్ గా చేసే బాధ్యత మనందరిదీ.

**అవినీతిపై రాజీలేని పోరాటం**

చరిత్ర ఒకసారి చూస్తే కొన్ని కీలక అంశాలపై అందరికీ అవగాహన ఉండాలి. రాజకీయ అవినీతిని ప్రజలు పట్టించుకోరనేది అపోహ మాత్రమే. అవినీతిపై టీడీపీ ఎల్లప్పుడూ పోరాడుతూనే ఉంటుంది. నాలుగు దశాబ్దాల ప్రయాణంలో అవినీతిపై రాజకీయ లేని పోరాటం చేసిన పార్టీ టీడీపీ. ఉమ్మడి రాష్ట్రంలో 1984లో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం నుంచి నిన్నటి విధ్వంస పాలన వరకూ రాజీలేని పోరాటం చేసింది టీడీపీ. ఉమ్మడి రాష్ట్రంలో రాజా ఆఫ్ కరెప్షన్ అనే పేరుతో లక్షల కోట్ల అవినీతిపై టీడీపీ చేసిన పోరాటం నిజమని సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు తేల్చాయి. అదే మన విశ్వసనీయత. వాస్తవాలతో అవినీతిపై పోరాడిన పార్టీ టీడీపీ. హైదరాబాద్ లో ఔటర్ రింగ్ రోడ్డు, వ్యాన్ పిక్, హిందూ, లేపాక్షి భూములపై పోరాడాం. ఓబుళాపురం అక్రమ మైనింగ్ పై మనం చేసిన ఉద్యమం నాడు దేశంలోనే ఒక సంచలనం. ఓబుళాపురం అక్రమాలు నిజమని పదేళ్ల తర్వాత కోర్టులు గుర్తించి శిక్షలు వేశాయి. మన ప్రతి పోరాట ఫలితం నేడు కళ్లముందు కనపడుతోంది.

**పెద్ద నోట్లు రద్దు చేయాలి**

నేను డిజిటల్ కరెన్సీ పెట్టమని ప్రధానికి రిపోర్ట్ ఇచ్చాను. దీని వల్ల అక్రమార్కులను తేలిగ్గా పట్టుకోవచ్చని చెప్పాను. ప్రజాసేవే పరమావధిగా పనిచేయాలి. పెద్ద నోట్లు రద్దు చేస్తేనే దేశంలో అవినీతి పోతుంది.పార్టీకి డొనేషన్ ఇవ్వాలంటే నేరుగా ఫోన్ ద్వారా అకౌంట్ లోకి డబ్బు చెల్లించవచ్చు.

**సీమ ముఖచిత్రం మార్చింది టీడీపీనే**

అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం. ఉత్తరాంధ్రపై ప్రత్యేక శ్రద్ధ పెడతాం. అమరావతి పూర్తి చేస్తాం. సాగునీరు ఇవ్వడం ద్వారా సీమ స్థితిగతులు మార్చాలని ఎన్టీఆరే మొదట సంకల్పం చేశారు. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలో ఫ్యాక్షనిజం అంతం చేశాము. తెలుగుగంగ, కేసీ కెనాల్, హంద్రీనీవా, నగరి గాలేరు, ముచ్చుమర్రి పూర్తి చేసింది టీడీపీనే. సీమ ముఖచిత్రం మార్చిన పార్టీ టీడీపీనే. 30 ఏళ్ల క్రితమే ఇజ్రాయిల్ నుంచి డ్రిప్ ఇరిగేషన్ తెచ్చి 90 శాతం సబ్సిడీతో మైక్రో ఇరిగేషన్ ఇచ్చింది టీడీపీనే. గత ఐదేళ్లలో ఒక్కపైసా కూడా ఇరిగేషన్‌కు ఖర్చు పెట్టలేదు. 2014 - 19లో రూ. 12 వేల కోట్లు ఖర్చు పెట్టాం. హంద్రీనీవా వెడల్పు చేస్తున్నాం. ఈ ఏడాదే పూర్తి చేసి చివరి భూములకు నీరిస్తాం. పోలవరం-బనకచర్లకు శ్రీకారం చుట్టబోతున్నాం. కడప జిల్లా కొప్పర్తి, కర్నూలు జిల్లా ఓర్వకల్లుల పారిశ్రామిక వాడలుగా తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్రంలో 5 రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ప్రారంభిస్తున్నాం. విశాఖ, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి , అనంతపురం కేంద్రాలుగా ప్రతి కుటుంబంలో ఎంట్రప్రెన్యూర్‌ను తయారుచేస్తాం. మండల పార్టీ అధ్యక్షులు, పార్లమెంటరీ నేతలు, క్లస్టర్ ఇన్ చార్జులు , మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు సమర్థ నాయకత్వాన్ని తయారుచేసుకోవాలి. శక్తి పెంచుకోవాలి. మనది పొలిటికల్ గవర్నెన్స్. ప్రతి కార్యకర్త ఈ ప్రభుత్వంలో భాగస్వామి అయ్యి వారి ద్వారా పాలన జరిగినప్పుడు నిజమైన పొలిటికల్ గవర్నెన్ సాధ్యం. ప్రభుత్వానికి, పార్టీకి అనుసంధానం పెరగాలి. దానికి మహానాడు ఒక వేదిక కావాలి. మహానాడు ద్వారా ఒకటే చెబుతున్నాను. ఏపీని, తెలుగుజాతిని నెంబర్ వన్ చేసే వరకూ నిరంతరం పనిచేస్తానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు

**పహల్గాం మృతులు, వీర సైనికులకు నివాళి :**

మరోవైపు మహానాడుకు వచ్చిన టీడీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు సాంస్కృతిక కార్యక్రమాలు, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం ఫోటోగ్యాలరీని తిలకించారు. రక్త దాన శిబిరంలో పాల్గొన్నారు. అలాగే సభ ప్రారంభమైన తర్వాతపహల్గాం మృతులకు, ఆపరేషన్ సిందూర్‌లో పోరాడి వీరమరణం పొందిన సైనికులకు సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అటు తెలుగుదేశం పార్టీలో మరణించిన వారికి కూడా సంతాపాన్ని వ్యక్తం చేశారు.

# వర్షపు నీరు మళ్లించేందుకు నిర్మిస్తున్న డ్రైన్ పనులు త్వరగా పూర్తి చేయండి







**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** వర్షపు నీరు మళ్లించేందుకు నిర్మిస్తున్న డ్రైన్ పనులు త్వరగా పూర్తి చెయ్యాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఎంజీ రోడ్, కృష్ణవేణి స్కూల్ రోడ్డు, పటమట, రాణి గారి తోట, కృష్ణలంక వారధి, ప్రాంతాలని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పటమట నిర్మలా కాన్వెంట్ వద్ద తరచుగా వర్షపు నీటి నిలువలు ఏర్పడటం గమనించి వాటిని మళ్లించేందుకు కృష్ణవేణి స్కూల్ రోడ్డు వద్ద డ్రైన్ నిర్మాణ పనులను చేపట్టిన సందర్భంగా ఆ పనులను క్షేత్రస్థాయిలో కమిషనర్ ధ్యానచంద్ర పరిశీలించారు. డ్రైన్ నిర్మాణ పనులలో పురోగతి లేకపోవడం గమనించి, అడ్డొచ్చిన విద్యుత్ స్తంబాలను తొలగించేటట్టు చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా ఏపీ సీపీడీసీఎల్ వారి సమన్వయం తో డ్రైన్ నిర్మాణంలో ఎటువంటి అడ్డంకులు లేకుండా త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తదుపరి రాణి తోట కృష్ణలంక వద్ద గల అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఆహార నాణ్యతలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, తాగునీటి, వాడుక నీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని, పైప్ లీకేజీలు ఎక్కడ ఉండరాదని, పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి జాప్యం వహించరాదని, అన్న క్యాంటీన్ నోడల్ ఆఫీసర్లు ప్రతిరోజు అన్న క్యాంటీన్లో పరిశీలించి ఎటు వంటి మరమ్మతులు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. యం జి రోడ్డు, కనక దుర్గ వారధి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని నగరం సుందరంగా పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కే. షమ్మీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

## కోడూరు టీటీడీ కళ్యాణ మండపంలో యోగా వేడుకలు ప్రారంభం



**కోడూరు మేజర్ న్యూస్ :** టిటిడి కళ్యాణమండపంలో ఎంపీడీవో. సుధా ప్రవీణ్ ఆధ్వర్యంలో యోగ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జూన్, 21 -6-2025 న ఆంధ్ర జాతీయ యోగ దినోత్సవాలు ప్రారంభం కానున్నాయి. యోగ ఆంధ్ర అనే యోగ అభియాన్. ఏపీ ప్రభుత్వం ప్రారంభించింది యోగ మన జీవితాల్ని మారుస్తుందని ప్రజలందరూ దానిని అనుసరిస్తున్నారని గౌ" శ్రీ" ప్రధానమంత్రి. నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కోడూరులో టీటీడీ కళ్యాణ మండపంలో యంపీడీవో సుధా ప్రవీణ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రామదాసు.ఎంపీపీ. వెంకట కుమారి, కోడూరు యస్ఐ కె.చాణిక్య, కూటమి నాయకులు తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు బండి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు కోట రాంబాబు, వేములపల్లి కృష్ణ పిల్లి మళ్ళీ, కోటమ్మ నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన కళ్యాణ మహోత్సవాలు





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** స్థానిక శివాలయంలో కొలువై ఉన్న శ్రీ రాజరాజేశ్వరీ సమేత శ్రీ రాజశేఖర్ స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు స్వామివారి పవళింపు సేవతో వైభవంగా ముగిశాయి. మంగళవారం ఉదయం బలిహరణ అభిషేకాలు వసంతోత్సవం పూర్ణహృతి సాయంత్రం ధ్వజా అవరోహణం ద్వాదశ ప్రదక్షిణలు స్వామివారి పవళింపు సేవతో కార్యక్రమాలను ముగించారు. ఉదయం స్వామివారికి అభిషేకాల్లో భాగంగా అన్నాభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించారు. భక్తులు భారీగా తరలివచ్చి లింగాష్టకం లలిత సహస్రనామం పారాయణం సామూహికంగా నిర్వహించారు. అనంతరం స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ అర్చకులు ఘంటసాల పవన్ సంతోష్ కుమార్ శర్మ. ఘంటసాల రాజశేఖర్ శర్మ. ఘంటసాల సత్యనారాయణ శర్మలు వేదమంత్రోచ్చారణ నడుమ కార్యక్రమ లు నిర్వహించగా భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ కార్య నిర్వహణ అధికారి స్వయంగా పర్యవేక్షించారు. కళ్యాణ మహోత్సవంలో భాగంగా స్వామివారిని నంది వాహనంపై పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు తమ వీధిలోకి వచ్చిన స్వామివారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు.



## టీడీపీ తీర్థం తీసుకున్న తిరువూరు మున్సిపల్ కౌన్సిలర్ మూడు దుర్గారావు

### కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన గద్దె అనురాధ

**విజయవాడ తూర్పు, మేజర్ న్యూస్ :** మంగళవారం ఉదయం అశోక్ నగర్ లోని తూర్పు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ గద్దె అనురాధ సమక్షంలో వైసీపీ పార్టీకి చెందిన తిరువూరు మున్సిపాలిటీ కౌన్సిలర్ మూడు దుర్గారావు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గద్దె అనురాధ తెలుగుదేశం పార్టీ కండువాను దుర్గారావు మేడలో వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ గద్దె అనురాధ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న కృషి ఆకర్షితులై దుర్గారావు పార్టీలో చేరటం మంచి పరిణామం అన్నారు. తెలుగుదేశం పార్టీ బడుగు బలహీన వర్గాలకు ఎల్లవేళలా పెద్దపీట వేస్తుందని అన్నారు. తన ప్రాంతం, తనను గెలిపించిన ప్రజలకు న్యాయం చేయాలంటే అది తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని భావించి తెలుగుదేశం పార్టీలో చేరటం జరిగిందన్నారు. ప్రభుత్వ పరంగ ప్రజలకు మంచి చేసేందుకు దుర్గారావుకు అన్ని రకాలుగా ఎంపీ శివనాథ్, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ అండగా ఉంటారని తెలిపారు. తెలుగుదేశం పార్టీలో చేరిన దుర్గారావుకు గద్దె అనురాధ అభినందనలు తెలియజేశారు.

# కడప క్రికెట్ స్టేడియం అభివృద్ధికి కృషి చేస్తాను







### ఏసీఏ అధ్యక్షుడు ఎంపీ కేశినేని శివనాథ్‌ను సన్మానించిన కడప డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్

### కడప క్రికెట్ స్టేడియం సందర్శించిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**విజయవాడ, మేజర్ న్యూస్ :** కడప క్రికెట్ స్టేడియంలో జాతీయ క్రికెట్ మ్యాచులు జరిగే విధంగా చర్యలు తీసుకోవటంతో పాటు, స్టేడియం అభివృద్ధికి కృషి చేస్తానని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఏసీఏ అధ్యక్షుడు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి కడప పుట్టంపల్లెలోని కడప క్రికెట్ స్టేడియాన్ని మంగళవారం సందర్శించారు. కడప స్టేడియంకు విచ్చేసిన ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్‌కి కడప డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భరత్ రెడ్డి, సెక్రటరీ రెడ్డి ప్రసాద్, స్టేడియం కన్వీనర్ సంజయ్ కుమార్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. ఎంపీ కేశినేని శివనాథ్‌తో పాటు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ను శాలువాతో సత్కరించారు.

ఏసీఏ అధ్యక్షుడు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కడ ప క్రికెట్ స్టేడియం అంతా పరిశీలించారు. క్రీడాకారులు, సంబంధిత సిబ్బం దితో మాట్లాడారు. వారికి కావాల్సిన సదుపాయాలు, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు అనుగుణంగా అన్నీ సౌకర్యాలు కల్పించామనీ, మరిన్నీ మెరుగైన వసతులు అందుబాటులోకి తీసుకువస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999